నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 28 అక్టోబర్ 2024 HYDERABAD



## పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.4, కనిష్ఠం 19.2 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 51 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఎలాంటి వర్ష సూచనలు లేవని పేర్కొన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన వాక్




బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా వాక్‌ను నిర్వహించారు. టాలీవుడ్ హీరోయిన్లు సంయుక్తామీనన్, మీనాక్షి చౌదరి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ దాకా సాగిన ఈ వాక్‌లో భాగంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. వందలాది మంది వైద్యులు, సిబ్బంది, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - బంజారాహిల్స్

# హైదరాబాద్‌ను ఆగం కానియ్యం



నాచారం ఎస్టీపీలో నీటి శుద్ధి తీరును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తదితరులు

## మూసీ పేరుతో లూటీ చేస్తే ఊరుకోం

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### నాచారం ఎస్టీపీ సందర్శన

నాచారంలోని సీవరేజీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, మూసీ పేరుతో లూటీ చేస్తే మాత్రం ఊరుకోమని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్‌ఎస్‌ని ఆదరించిన హైదరాబాద్‌ను ఆగం కానియ్యమని, ఇక్కడి పేదలకు బీఆర్‌ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వివేకానంద్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతిసాయిజెన్‌శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, శిరీషా సోమశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. –ఉప్పల్, అక్టోబర్ 27



## హైడ్రాకు సర్కారు భూముల వివరాలు

### నివేదిక సిద్ధం చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం

మేడ్చల్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు ప్రభుత్వ భూముల వివరాలను అందించేలా నివేదికలను సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను, నివేదికలను రెవెన్యూ యంత్రాంగం సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. జిల్లావ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 12 మండలాలు ఉండగా, స్థానిక తహసీల్దార్లు ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో సర్కారు భూముల వివరాలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి సమర్పించగా, మిగతా మండలాల్లోని ప్రభుత్వ భూముల వివరాలు వచ్చిన వెంటనే నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు హైడ్రాకు సమర్పించనున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులు గుర్తించిన చెరువుల వివరాలను హైడ్రాకు సమర్పించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన నిర్మాణాలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గుర్తిస్తున్నారు.

### భూములు 5,120 ఎకరాలు

మేడ్చల్ జిల్లావ్యాప్తంగా 5,120 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 425, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425, మేడిపల్లి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400, కీసర మండలంలో 417, కుత్బుల్లాపూర్ మండలంలో 600, బాచుపల్లి మండలంలో 360, ఉప్పల్ మండలంలో 333, మల్కాజిగిరి మండలంలో 113, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తున్నది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎన్ని స్థలాలు కబ్జాకు గురయ్యాయి. సంరక్షణలో ఎన్ని భూములు ఉన్నాయన్నది ప్రస్తుతం ప్రభుత్వ భూముల వివరాల సేకరణలో పూర్తిగా లెక్క తేలనున్నది. అయితే అనేక భూములు కబ్జాలకు గురైనట్లు అధికారులకు స్పష్టంగా తెలిసినప్పటికీ వివరాలను ఏ విధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిస్తారన్నది వేచి చూడాల్సిందే.





## సదర్ సందడి..

ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం సదర్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# స్తంభిస్తున్న నగరం

## సిటీలో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపు

ట్రాఫిక్ నియంత్రణకు అమలు కానీ ఉమ్టా అధ్యయనాలు

సూచనలు.. భవిష్యత్ ప్రణాళికలను పక్కన పెట్టిన హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా హెచ్‌ఎండీఏ చేసిన ట్రాఫిక్ అధ్యయనాలు మూలనపడుతున్నాయి. పెరుగుతున్న వాహనాలు, రోడ్ల విస్తరణ, అందుబాటులో ఉన్న ప్రజా రవాణా సౌకర్యాలు, ఆధునిక రవాణా అంశాలపై కాంప్రెన్సివ్ ట్రాన్స్‌పోర్టు రిపోర్టును రెండేండ్ల కిందటే సిద్ధం చేశారు. అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సర్వే ఇప్పటికీ అమల్లోకి రాలేదు. కనీసం అధ్యయనంలో పేర్కొన్న సూచనలు, భవిష్యత్ ప్రణాళికలను కూడా పక్కనపెట్టేశారు.

### పరిష్కార మార్గాల అన్వేషణ


శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరానికి ట్రాఫిక్ సమస్య అత్యంత ప్రమాదకారిగా మారింది. నగరవాసులు జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే ట్రాఫిక్ సమస్యలకు శాస్త్రీయంగా అధ్యయనం చేసిన హెచ్‌ఎండీఏ అందుకు తగినట్లు పలు పరిష్కార మార్గాలను అన్వేషించింది. రెండేండ్ల కిందట చేసిన ఈ ట్రాఫిక్ సర్వే ఇప్పటికీ అమలు కాలేదు. శివారు ప్రాంతాలను దాటి విస్తరిస్తున్న మహానగరానికి రవాణా వ్యవస్థ ఎంతో కీలకం. అంచనాలకు మించి వేగంగా పెరుగుతున్న వాహనాలతో రవాణా రంగంపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్‌లు వంటి రవాణా సదుపాయాలతోనూ ప్రజల రవాణా సాఫీగా సాగడం లేదు.



### పెరిగిన వ్యక్తిగత వాహనాల వినియోగం

నగరంలో దాదాపు కోటికి పైగా వాహనాలు నిత్యం తిరుగుతున్నాయనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇందులో ప్రజా రవాణా సంస్థలకు సంబంధించిన వాహనాల కంటే వ్యక్తిగత వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. పెరిగిన జనాలకు అనుగుణంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు సౌకర్యాలు లేకపోవడంతో వ్యక్తిగత వాహనాల వినియోగానికే ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఇటీవల కాలంలో అంచనాలకు మించి ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ప్రయాణ సమయం విపరీతంగా పెరగడంతో ప్రత్యామ్నాయ ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటు అత్యంత కీలకంగా మారింది. దేశంలోని మిగిలిన మెట్రో సిటీలకు మాదిరి ట్రాఫిక్ తీవ్రత హైదరాబాద్‌లోనూ పెరుగుతుండటంతో... ఉమ్టా చేసిన ట్రాఫిక్ అధ్యయనాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### 2031 లక్ష్యంగా..



2031 లక్ష్యంగా సిటీలో చేపట్టిన కాంప్రహెన్సివ్ ట్రాన్స్‌పోర్టు స్టడీ సూచనలు అమల్లోకి తీసుకొస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీరే అవకాశముంటుంది. ఇప్పటికే మెట్రో రైళ్లతో వేగంగా ప్రయాణించే వెసులుబాటు దొరికింది. కానీ రోడ్లపై వాహనాల రద్దీ తగ్గలేదు. నగరంలో పెరుగుతున్న వెహికిల్ లోడ్, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించాల్సి ఉంటుంది. ఆటోమెటిక్ ట్రాఫిక్ కౌంటర్ కమ్ క్లాసిఫైర్ విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. నగరానికి అవసరమైన రవాణా వ్యవస్థల రూపకల్పనపై అధ్యయనం చేశారు. కానీ చేసిన అధ్యయనాలను అమలు చేయకపోవడంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయి.

# కనీస వసతులేవి ?

సమస్యలకు నెలవుగా 'డబుల్' ఇండ్లు • వసతులు కల్పించాలంటున్న లబ్ధిదారులు

ప్రజావాణిలోనూ అనేక సార్లు ఫిర్యాదు • నేడు కమిషనర్‌ను కలవనున్న మురహరపల్లి వాసులు

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ): డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనపై బల్దియా మీనమేషాలు లెక్కిస్తున్నది. దీంతో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. మౌలిక వసతులు కల్పించాలంటూ..లబ్ధిదారులంతా గడిచిన పది నెలలుగా జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో మొర పెట్టుకుంటూ వస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 66వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇండ్లలో లిఫ్టులు పనిచేయడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతున్నదని ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని డబుల్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ.. లబ్ధిదారులు ఇందిరాపార్కు, జోనల్ కార్యాలయాల ముందు ఆందోళన సైతం చేపట్టారు. స్పందించిన అప్పటి కమిషనర్ ఆమ్రపాలి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే నీటి సరఫరా, డ్రైనేజీ , లిఫ్టులు, కరెంట్, రహదారులు, ఇతర సదుపాలయాల పనులకు టెండర్లు పిలుస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. ఆచరణలో మాత్రం పనులు జరుగుతున్న దాఖలాలు లేవని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజావాణికి లబ్ధిదారులు పెద్ద ఎత్తున వచ్చి కమిషనర్ ఇలంబర్తి ముందు తమ ఆవేదన, నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. శామీర్‌పేట వద్ద మురహరపల్లి 2 బీహెచ్‌కే లబ్ధిదారులు కమిషనర్‌ను కలవనున్నారు.




మురహరపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ నేత దశరథ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు హాజరయ్యారు.

## రూ.100 కోట్ల నిధులపై రానీ స్పష్టత?

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 111 లొకేషన్లలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఉన్న చోటే 27 ప్రాంతాల్లో (ఇన్ సైట్)లో 5,363 మందికి, 39 లొకేషన్లలో 63,478 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేసిన సంగతి తెలిసిందే. అలాగే 66 లొకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కొన్ని చోట్ల కరెంట్ కనెక్షన్, కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్‌నెట్, ఇతర మెయింటనెన్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా కేసీఆర్ సర్కారు హెచ్‌ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్‌ఎంసీకి బదలాయించింది. నిబంధనల ప్రకారమే జీహెచ్‌ఎంసీ ఖజానాలోకి రూ.100 కోట్లు వచ్చి చేరాయి. కానీ నేటికి ఈ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. పైగా డ్రైనేజీ, నల్లా కనెక్షన్ వేసిన జలమండలికి నిధులు మంజూరు చేయలేదు. డబుల్ బెడ్రూం ఇండ్లకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. అయితే రూ. 100కోట్ల నిధులను ఎలా సమకూర్చుకొని మౌలిక వసతుల కల్పనకు ఎలా కృషి చేస్తారన్నది స్పష్టత లేదు. మొత్తంగా మరిన్ని నెలలు లబ్ధిదారులు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి నెలకొన్నది.